త్రినేత్రుడు

శ్రీ రావూరి భరద్వాజ

ఆ కాలంలో గుణనిధి పేరు ఆబాల గోపాలానికీ సుపరిచితమైనదే!

అతనికి విశాల సామ్రాజ్యముండటమూ, ఆ సామ్రాజ్యం సకల సుఖాలకూ నిధానమై ఉండటమూ అందుకు కారణం కాదు. అతడు విద్యావంతుడు. ఆ కారణాన పండితులను కవులను అమితంగా ఆదరించాడు. స్వయంగా కొన్ని కావ్యాలను రచించాడు. ఎన్నిటినో అంకితం పొందాడు. నిజానికివికూడా సరైన కారణాలు కావు. డబ్బు కాశించిన కవులు, ఏ రాజునైనా ఇంద్రుడని చంద్రుడని పొగడవచ్చు. దానకర్ణుడని, అభినవదధీచి అని కీర్తించవచ్చు. కాని సామాన్య జనం అలా అంటుందా? పట్టుమని పాతికమంది కవులు కీర్తించినంతమాత్రాన, అశేష జనావళి ఆ మాటలను విశ్వసిస్తుందా? లేదుగానీ గుణనిధి ఏలుబడిలో ఉన్న ప్రజలందరూ అతన్ని కీర్తిస్తున్నారు. సరయిన పరిపాలన—అంటే—ప్రజల కష్టనిష్ఠురాలు తనవిగా భావించి చేసే పరిపాలన, గుణనిధికి జన్మతో బుట్టిన విద్య.

[illegible] చీదకుండా, తల్లిపొత్తిళ్ళలోని పసిపాపలులాగా ప్రజలు సుఖజీవనం చేస్తున్నారు. అదృష్టవశాత్తూ ఆ దేశపు నైసర్గిక పరిస్థితులుకూడా అందుకు అనుకూలంగా ఉన్నాయి. రెండు వైపుల మహానది ప్రవహిస్తున్నది. ఒకవైపున పెట్టనికోటలాగ పర్వతపంక్తులున్నాయి. ఈ మూడుదిక్కులనుండీ శత్రుభయమన్న మాట లేదు. నాల్గవదిశ మరొక రాజ్యమున్నది. కొన్ని దశాబ్దాల నుండీ, ఈ రెండురాజ్యాలూ అన్నదమ్ములలాగా మెలగుతున్నాయి. సంపత్సమృద్ధి కారణంచేత విద్యాసముపార్జనాసక్తులు, లలితకళాప్రియులు, దేశంనిండా కిలకిలలాడుతున్నారు. జీవితం, జీవితం లాగా కాక, రుచిరస్వప్నంలాగా వారు అనుభవిస్తున్నారు.

అయితే ఈ రుచిరస్వప్నం ఎక్కువకాలం ఉండలేదు. అది భగ్నమయ్యే సమయం సమీపించినట్లు అనేక చిహ్నాలు హెచ్చరించాయి.

ఒకనాడు గుణనిధి కొలువులో ఉండగా, భటుడొకడు తత్తరపాటుతో ప్రవేశించి, గౌరవ పురస్సరంగా వంగి అభివాదం చేసి, ఉత్తరమొకటి రాజుగారికిచ్చాడు. సాహిత్య మీమాంసతో, ఊగిసలాడిపోతున్న సభ ఒక్కసారి మ్రాన్పడిపోయింది. రాజుగారు లేఖను మంత్రికిచ్చాడు. మంత్రివదనం వాడిపోయింది. కొన్ని క్షణాలపాటు మంత్రిగారు మాట్లాడనుకూడా మాట్లాడలేకపోయారు. తప్పదు గనుక కడకు లేచి నిలబడి, సభికుల నుద్దేశించి ఇలా అన్నాడు :—

"మహాజనులారా" మంత్రి కంఠం జీరపోయింది. "ఇంత కాలంనుండీ మనం ఏ కష్టమూ ఎరుగక సుఖంగా రోజులు వెళ్ళబుచ్చాం. నిజం మాట్లాడితే మనకు 'సుఖం'మీద మొహం మొత్తింది కూడాను. భగవంతుడు కూడా బహుశః ఇదే అభిప్రాయంలో ఉన్నాడేమో మరి! ఏనాడూ వినని మహావిపత్తు ఇప్పుడొకటి మనల్ని చుట్టుముట్టనున్నది. అణకువగల శాలినిలాగా, ఇన్ని రోజులనుండీ అణిగిమణిగి ఉంటున్న మహానదికి తీవ్రంగా వరదలు వస్తున్నట్లు తీర రక్షకభటులు ఇప్పుడే వార్తను పంపించారు. వరదల ఉధృతాన్ని బట్టి చూస్తే, మహానది ఏ క్షణంలోనైనా, పొంగి దేశాన్ని ముంచెత్తగలదని తీరరక్షణశాఖ ప్రధానోద్యోగి అభిప్రాయపడుతున్నాడు. ఐనా మనం భయపడవలసిన పనిలేదు. సైనికశక్తినంతా తరలించి, వరద ప్రమాదాన్నుండి దేశాన్ని రక్షించే ప్రయత్నాన్ని ఇప్పటినుంచే ప్రారంభించవలసిందిగా సర్వసైన్యాధ్యక్షునికి ఉత్తరువు లిస్తున్నాను..."

ముఖ్యమంత్రి ఏదో చెబుతూనే ఉన్నాడు. సభికులు వింటూనే ఉన్నారు. జనాన్ని తొలగద్రోసుకొంటూ మరొక భటుడు ప్రవేశించి మరొక జాబును మంత్రిగారికిచ్చాడు. మంత్రి నడుము విరిగినవాడిలాగా, ఆసనంలో కూలబడ్డాడు. రెండు చేతులమధ్యా తల నిరికించుకొని నేలచూపులు చూస్తూ ఉండిపోయాడు. ఆ ఉత్తరంలోని విషయమేమిటోనని సభ గుసగుసలు పోయింది. ఒకరిద్దరు 'రెండవ లేఖలోని విశేష మేమి'టని కూడా అడిగారు.

మంత్రిగారు చాలా సేపటికిగానీ తెప్పరిల్లలేదు. అయినా ఆయన నిలబడలేకపోయాడు. గుణనిధి అనుజ్ఞ తీసుకొని, కూచునే ఆ లేఖలోని విషయం వివరించాడు.

"నదీప్రవాహం గట్లు త్రెంచుకొని దేశంమీద పడ్డది. ఉత్తుంగ తరంగాలు గ్రామాలకు గ్రామాలను నాశనం చేస్తున్నాయి. మహానది మహావేగంతో, కోపించిన మత్తేభంలా దేశంమీదకు పరుగులెత్తుతున్నది. మహాజనులారా! ఒక్క మనవి!!" ఈ మాట అని మంత్రి కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయాడు. అతని కన్నుల నుండి అశ్రువులు టపటపమని నేల రాలాయి "ప్రభుత్వం మీకు చేయగలిగిన సహాయమంతా చేస్తుంది. స్వీయశ్రేయస్సుకన్న, ప్రజాశ్రేయస్సే రాజరికం వారికి ముఖ్యధర్మమని, మీరెన్నిసార్లో రుజువు చేసుకొన్నారు. మహారాజులు, ఈ విపత్తులోకూడా ఆ ధర్మాన్ని విడనాడరని నేను హామీ యిస్తున్నాను. కానీ, ఇంతటి

ఘోర ప్రమాదావసరంలో ప్రభుత్వం మీకు చేసే ఉపకారం చాలా స్వల్పకాలంలో ఉంటుంది. మీ ఆత్మరక్షణను మీరే చేసుకోండి. ఎవరి ప్రాణాలను వారు దక్కించుకోండి. అవకాశమున్న మేరకు ఇతరులకు తోడ్పడండి. ప్రభుత్వం మీకు సహాయపడటానికే సర్వవిధాలా ప్రయత్నిస్తుంది. ఇక సభ ముగించేదాం"

* * * *

ఆనాడు శంకరుడు చాలా చికాగ్గా ఉన్నాడు. అతి ముఖ్యమైన విషయాలు నివేదించటానికొచ్చిన ప్రమథులను కసిరి కొట్టాడు. ఆప్యాయంగా లాలించే నందీశ్వరుణ్ణి పారద్రోలాడు. కాలుకాలిన పిల్లిలాగా అటూ ఇటూ తిరిగాడు. అడ్డంవచ్చిన వస్తువులను ఈడ్చితన్నాడు. పార్వతీదేవి ఇదంతా గమనిస్తూనే ఉంది. కారణంకోసం ఆవిడ ఆలోచించలేదు. తరచు భర్తచేసే పిచ్చిపనులు సర్దుకోలేక ఆవిడ సతమతమయిపోతున్నది. మొన్నటికి మొన్న ఆ భస్మాసురిడికి, ఆ దిక్కుమాలిన వరమొకటి ఇచ్చాడు. వాడా వరాన్నే తిప్పికొట్టటానికి సిద్ధమయేసరికి—తప్పించుకొందుకు నానాబాధలూ పడవలసి వచ్చింది. విష్ణుమూర్తి లేకపోతే ఏంగానూ? ఆ జలంధరుడికీ అల్లాగే ఇచ్చాడు. వాడు—చివరికి తన వెంటనే పడ్డాడు. ఆ గండం గడవడానికి ఎన్ని చిక్కులు పడవలసి వచ్చిందో జ్ఞప్తికి తెచ్చుకొంటే, పార్వతీదేవి హడలిపోతుంది.

"ఏదిచేసినా ఇంతేనూ! ఒక ఆలోచనలేదు పాడూలేదు. ఏది అడిగితే దాన్ని ఇచ్చేయడమే! అదృష్టవశాత్తూ ఏ భక్తుడూ నన్నడగలేదు. అడిగితే నన్నివ్వడానికికూడా ఈయన సందేహించరు. తను భక్తసులభుణ్ణని, మహాదాతృత్వణ్ణని అంతరంగంలో ఉండిపుండాలి. అది నిరూపించుకోవటంకోసం, నానాబాధలూ పడతారు. వ్యవహారం చూస్తుంటే—మళ్ళా ఏదో కొంపమునిగినట్టే ఉంది" అనుకొన్నది పార్వతి.

"ఏమిటండీ?" అని పార్వతి అడగలేదు. కాని శంకరుడే "ఏమిటంటే" అంటూ ప్రారంభించాడు. "నా కొద్దుబాబో అని మొత్తుకొంటున్నా వినకుండా దేవలోకం ఈ బాధ్యత నా నెత్తిన కట్టింది. మొదట్లో సాధకబాధకాలు తెలియక నేనూ అంగీకరించాను. దీనివెనుక బ్రహ్మాండమైన కుట్ర ఉన్నట్లు ఇటీవలదాకా నాకు తెలియదు." అన్నాడు శివుడు.

"తలా తోకా నాకు తెలియటల్లేదు" అన్నట్టు ముఖం పెట్టింది గిరిజాదేవి; ఆమాట పైకి అనటానికి ధైర్యం లేక.

"నీకు ప్రతీదీ విడమర్చి చెప్పాలి" అని విసుక్కున్నాడు రుద్రుడు. "సృష్టించే బాధ్యత బ్రహ్మది. పోషించటం విష్ణుమూర్తి వంతు. లయం నా పాలబడ్డది."

"ఇందులో కుట్ర ఏమున్నదీ?" అని మెల్లగా అన్నది గిరిజ హడలిపోతూ.

"పాషాణానికి పుట్టిందానివి; నీకు తెలివితేటలుంటాయనుకోవటం నాదే పొరబాటు." అని రెండుసార్లు అటూయిటూ తిరిగాడు శివుడు. "అదిగాదే! నీ కీమాత్రం తెలీదా? నానా జంతుజాలాన్నీ, మనుషుల్నీ, కొండల్నీ, నిట్టలను, అన్నిటినీ శక్తిమని సృష్టిచేసి గమ్మున కూర్చున్నాడు బ్రహ్మ. ఆయన్న నేవాళ్ళెవరూ లేరు. ఆ ఉన్నదానితో, అలా యిలా రెండురోజులు నాటకమాడించేస్తాడు విష్ణుమూర్తి. సంహారణం నా కాళ్ళకు చుట్టుకొంది. నా విధి నేను తప్పకుండా చేయవలసిందేనాయె. జీవకోటి యావత్తూ నన్ను ప్రబలశత్రువుగా చూడటం, నేను సంహారకుణ్ణనే! అసలున్నకిటుకేమిటంటే, ఉండే లోసుగులేవో సృష్టిలోనే ఉన్నాయి. అవి విష్ణుమూర్తిగారి హయాంలో పరాకోటి నందుకొంటాయి. అంతటితో అవి చరమదశకొస్తాయి. ఆ కాస్తాపనీ నా చేతిమీదుగా జరిగిపోతుంది. ఉన్న పద్ధతి ఇదీ! అయితే ఎవ్వరూ ఇట్లా అనుకోరు. నే నెట్లా చావను?" అన్నాడు మృత్యుంజయుడు; తనకు చావులేదన్న విషయం తాత్కాలికంగా మరిచి.

"నిజమే సుమా!" అన్నది పార్వతి ఈ వివేకం ఇప్పుడే తనకు కలిగినట్లు. నిజానికి ఇందులో ఆవిడ కేమాత్రం ఉత్సాహమూ లేదు. అలా లేనట్లు పైకి కనుపించితే 'అయన' మరీ మండిపడతాడు. అదీగాక శంకరుడు అల్పసంతోషి. కాస్త ఊదర ఎవరు కొట్టినా ఉబ్బి తబ్బిబ్బవుతాడు. ఈ బలహీనత పార్వతి ఏనాడో గమనించింది. తనకేపని కావలసివచ్చినా, భర్తను కాస్త ఉబకేసి నెరవేర్చుకోవటం ఆవిడ కలవాటయింది. రవంత ప్రోత్సాహకరంగా మాట్లాడితే చాలు; చిత్తయిపోగలడు.

"పార్వతికి కొంతలో కొంతైనా 'జ్ఞానోదయం' కలిగినందుకు శంకరుడు చాలా సంతోషించాడు.

"నిజంగా ఇందులో నా తప్పేమిటి?" అన్నా డతను భార్యతో. "నీళ్లు సృష్టించింది బ్రహ్మ. దానికి ప్రవహించే శక్తి నిచ్చిందికూడా అతనే గదా?"

"ఔను" అన్నది పార్వతి.

"దానిచేత రకరకాల చేష్టలు చేయిస్తున్నవాడు హరి. అవును గదా?"

"ఔను."

"గుణనిధి రాజ్యానికి సరిహద్దుగా ప్రవహిస్తున్న మహానది భయంకరమైన వరదలతో పొంగుకొని, అతని దేశాన్నంతా ముంచివేసింది. పదింట మూడువంతుల దేశం వరదలో మునిగిపోయింది. వేలాది గ్రామాలు మునిగిపోయాయి. లక్షలకొలది చచ్చిపోయారు. పంటభూములన్నీ నీటిమయములైనాయి. పశువులు...సరేసరి. బ్రతికివున్న కొద్దిమందీ, నరకయాతన పడుతున్నారు. ఈ ఘోర కలికి కారణం నేనేనని, వారి ఉద్దేశ్యం. స్థితి కారణకర్త విష్ణువని, ఈ మహాఘోరానికి బాధ్యుడు అతగాడని వారనుకోవటం లేదు. హరికి నామీద, లోలోపల చెడ్డఅభిప్రాయాలున్నాయి. నా గౌరవాన్ని కించపరచాలనీ, నా యశస్సును కళంకితం చేదామనీ, తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు నేననుమానిస్తున్నా. లేకపోతే, ఇటువంటి దారుణమైన పనిచేయవలసిన అవసరమేమిటో నాకు బోధపడకుండా ఉన్నది. ఏహ్యతి ఏహ్యమైన ఫలితాల నిచ్చే

బీజాలు బ్రహ్మ నాటడమూ, విష్ణువు వాటిని పోషించడమూ; చివరకు ఆ విషఫలితా లనుభవించవలసిన వాణ్ణి నేనా?"

పార్వతికిగూడా ఇది చాలా అన్యాయమనే తోచింది. "అయితే—మీ రిప్పు డేమిటి చెయ్యాలను కొంటున్నారు?" అన్నది.

"అదే నాకూ తోచటంలేదు" అన్నాడు శివుడు తల గోక్కుంటూ. చంద్రరేఖ భయంతో వెనక్కు ముణుచుకొంది.

"పోనీ మీరు మరొకశాఖ తీసుకోగూడదూ?" అని సలహా ఇచ్చింది పార్వతి.

"ఓ. నీ ఆలోచన దివ్యంగా ఉన్నది." అన్నాడు శివుడు. అంతలోనే, తను ఇందాక పార్వతిని, తెలివిలేని దద్దమ్మగా అడి పోసుకొన్న సంగతి జ్ఞప్తికొచ్చి "అయినా ఇప్పుడేమీ చెప్పలేను. ఆలోచించి చూస్తాను." అన్నాడు.

2

సుఖాలమీద సుఖాలురావటం కష్టమే కావచ్చు. కష్టం వెంట కష్టం, బాధ వెంట బాధ ఇసకపాతరల్లే రావడం మహా సులభం.

ఇప్పటికే రాజ్యం నానా కచాటుగానూ ఉంది. కొన్ని లక్షలమంది జనం, కొన్ని గంటల్లో చనిపోయినప్పుడు, ఆ దృశ్యం ఊహించటంగూడా కష్టమే! చచ్చినవారు చావగా బ్రతికినవారు కూటికీ గుడ్డకూ అల్లాడిపోతున్నారు. సుక్షేత్రాలన్నీ వరదలపాలయ్యాయి. రాజ్యమంతటికీ అన్నవస్త్రాదులిచ్చే భూములు ఇసక మేటలు వేశాయి. తిరిగి వాటిని సాగుచెయ్యాలంటే కొన్ని సంవత్సరాలు పడుతుంది. విశేషమైన జననష్టం సంభవించిన కారణంగా, మానవశ్రమగూడా వలసినంత లభించటం లేదు. ఉన్నవారైనా రోగపీడితులు, క్షుధాబాధితులూను. వారిచేత పనిచేయించటం గుణనిధికి ఎంతమాత్రం ఇష్టంలేదు. అయితే మరి పునర్నిర్మాణ మెలా? శ్మశానవాటికలాగా మారిపోయిన ఈ విశాల ప్రదేశమంతా ఇలా పడిఉండవలసిందేనా?

"కాదు ప్రభూ!" అన్నాడు ముఖ్యమంత్రి. "మనం ఇంత వరకు ఒకరిని యాచించలేదు. యాచకులను ఆదరించకపోనూ లేదు. కాలం మారినప్పుడు, కాలానుగుణంగా మనమూ మారాలి. ప్రభువులు అన్యథా భావించరన్న విశ్వాసంతోనే నొక సూచన చేయదలచుకొన్నాను. మన పొరుగురాజు మిత్రావసుని సహాయం, మన మీ సమయంలో అర్థించుదాము. మనకు సంభవించిన ఈ ఘోరాపద, ఆ మహారాజుకు తెలియకపోదు. కష్టకాలంలో, సోదరప్రభువుకు ఆపాటి సాయం మిత్రావసు చేయగలడన్న నమ్మకం నా కున్నది. నేనే, ఒక సౌహార్ద ప్రతినిధిని, అతనివద్దకు పంపాలని అనుకొంటున్నాను....ఇందులో..."

గుణనిధి కళ్లవెంట జొటజొట నీరుకారింది. "ఇది ఆత్మాభిమానాన్ని హత్యచేస్తుందేమో?" నన్న సందేహం వెలిబుచ్చాడు గుణనిధి.

"మనం ప్రజలకోసం చేస్తున్నాముగానీ, స్వీయానికి కాదు. ఈ సాయం మనకు రాకపోతే, మిగిలిన ఈ ప్రజానీకానికి మనం కూడు గుడ్డ లెలా ఇవ్వగలం? చేతకులా ఇంతమందిని మృత్యుముఖంలోకి నెట్టగలమా? ఇంతకాలమూ మనం, వారి ఉప్పు పులుసులు తిన్నాము. సమయ మొచ్చినప్పుడు, "మన గౌరవం—మన ఆత్మాభిమానం" కించపడుతుందని, వారిని చంపటమా? మీ, నా గౌరవా గౌరవాలకోసం, ఇన్ని లక్షలమందిని బలిచేయటం నా అభిమతం కాదు. మీ అభిప్రాయ మేమిటి? మిత్రావసు మన సాటి రాజు. సహృదయుడు. ఈ ఆపత్సమయంలో మనలను ఆదుకొంటాడు. మీ ఉద్దేశ్య మేమిటో చెప్పండి! కూడు గుడ్డలకు కరువైన దేశంలో, ఎంత మాతృదేశాభిమానమున్నా మనుషులు ఉండలేరు. అది లభించే మరొకచోటుకు తప్పకుండా పోతారు. మనం సత్వరమే తగిన విధానం ఆలోచించకపోతే, ఈ ప్రజ మరొకచోటికి వలసపోతారు. పోక తప్పదు. అప్పుడు మీరు, నేను, మన మన ఆత్మగౌరవాలు మాత్రమే ఇక్కడ మిగిలిఉండటం జరుగుతుంది..."

"ప్రభూ!"

అంటూ భటుడొకడు వచ్చాడు.

"ఏమిటి?" అన్నట్టు కనుబొమలతో ప్రశ్నించాడు మంత్రి.

"మిత్రావసు ప్రభువు సైన్యసన్నద్ధుడై వస్తున్నట్టు ఇప్పుడే వేగులవాని వార్త."

గుణనిధి నిలువునా కుంగిపోయాడు. మంత్రి ముఖాన గోటి గాటుకు నెత్తురులేదు. ప్రాప్పడిపోయాడు. కొంతసేపటికి తెప్పరిల్లి "ప్రభూ! కష్టాలలో ఉన్న మనకు ప్రతిదీ అశుభాన్నే తలపింప చేస్తున్నది. మనకు సంభవించిన ఈ దుర్గతికి చింతించి, మన క్షేమసమాచారాల నడగడంకోసమయి మిత్రావసు వస్తున్నాడేమో..."

"సైన్యంతోనా?" అన్నాడు గుణనిధి.

కొన్ని గంటలలో అంతా ముగిసిపోయింది. సమయంకోసం కాచుకుకూచున్న మిత్రావసుకు, చక్కని అవకాశం లభించింది. దేశం నానా బీభత్సంగా ఉంది. సైన్యంలో ఎక్కువభాగం (ప్రజల్ని రక్షించే కార్యక్రమంలో) నాశనమైంది. ఉన్న సైన్యానికీ, ప్రజలకు తిండిలేదు. మీదు మిక్కిలి ఎంతో అసంతృప్తి అందరిలోనూ గిలగిలలాడుతున్నది. ఒక దేశాన్నాక్రమించటానికి కావలసిన పరిస్థితు లివేనూ. మిత్రావసు ఈ అవకాశాన్ని చక్కగా వినియోగించుకొన్నాడు. కొంత సైన్యాన్ని వెంటబెట్టుకొని, గుణనిధిమీద యుద్ధం ప్రకటించాడు. విరివిగా ఆహారపదార్థాలిచ్చి, ప్రజలను, కొందరు సైనికులను, అధికారులను తనవైపుకు తిప్పుకొన్నాడు మిత్రావసు. ఇంత స్వల్పపు లంచానికి—కేవలం కూటికి—మానవుడు ఇంతగా లోబడిపోతాడని మిత్రావసుగూడా అనుకోలేదు. ప్రభుభక్తిపరాయణులైన కొందరు మాత్రం గుణనిధి తరఫున యుద్ధంచేశారు. మిత్రావసు సైనికశక్తి అధికమైనది కావటంవల్లా, అధికారులు కోట రహస్యాలను వెల్లడించడంవల్లా, గుణనిధి ఓడిపోయాడు. మంత్రి పోరాటంలోనే మరణించాడు.

అంతఃపురం అగ్నిప్రవేశం చేసింది. గుణనిధిగూడా ఆత్మహత్య చేసుకోబోయాడు. కానీ ఏదో మహత్తరమైన శక్తి అతని ఆ పని నుండి విరమింపజేసింది. శత్రుసైనికులు, విజయోత్సాహంలో, కోటలోకి ప్రవేశిస్తున్న తరుణంలోనే, గుణనిధి రహస్యమార్గంగుండా తప్పించుకొన్నాడు. గుణనిధికోసం మిత్రావసు కోటనంతా గాలించాడు. అతని జాడ ఎక్కడా కనపడలేదు.

* * * *

అపూట శంకరుడు ఉత్సాహంగా ఉన్న సమయం కనిపెట్టి "దాని విషయం ఏమాలోచించారండీ?" అన్నది పార్వతి.

"దేనివిషయం?" అన్నాడు శంకరుడు.

'మరీ ఇంత మరుపేమిటో' అని మనసులో అనుకొన్నది పార్వతి. "అదే! మీ శాఖను మార్చుకోవటం గురించి" అన్నది పైకి మామూలుగా.

"మార్చుకోవటం నా కంతగా నచ్చలేదు"

"అయితే అనుభవించండి" అన్నది పార్వతి కష్టపడుతూ. "పదవులేమో కావాలి. బాధ్యతలు మట్టుకు ఉండకూడదు. ఒక చెంప 'లోకమంతా నన్ను ఆడిపోసుకొంటుందో' అని గోల పెడ్తుంటిరి. మరో చెంప పదవిని బట్టుకొని వేళ్ళాడుతుంటిరి. అంత వ్యామోహం ఉన్నవారు, అలా అనుకోవటం దేనికి?" అని నాలుగు పెట్టింది పార్వతి.

నిజంగా శంకరుడికి కోపం రావలసింది. రాకపోగా, చిరునవ్వొకటి నవ్వేశాడు.

"నువ్విలాగే అంటావని నాకు తెలుసు. అదృష్టవశాత్తూ నేనూ నీలాంటివాడనే అయితే,...ఇక చెప్పవలసిం దేముందీ!" అని కొనసాగి, "నేను తీవ్రంగా ఆలోచించాను. గట్టిగా పట్టుబడితే, శాఖ మారకపోదు. అలా మార్చుకోవటంవల్ల మరొక ఘోరమైన ప్రమాదం కలిగే సూచనలు కనుపించాయి. ఇక మార్చుకోవటమన్న ఉద్దేశాన్నే మార్చుకొన్నాను." అన్నాడు.

"ఘోరమైన ప్రమాదమే!" అని ఆశ్చర్యాన్ని నటించింది పార్వతి. శంకరుడున్న ఉత్సాహంలో, పార్వతి కంఠంలోని అపహాస్యాన్ని గుర్తించలేకపోయాడు.

"నిక్షేపంగా! ఇలా మార్చుకొన్నందువల్ల, బ్రహ్మవిష్ణులు నన్ను గురించి ఎంత మాట్లాడినా మాట్లాడవచ్చు. 'శంకరుడు ఉత్త అర్భకుడనీ, ఆ శాఖను నిర్వహించలేక మావద్దకొచ్చి ప్రాధేయపడ్డాడనీ, మేమే దయదలిచి మార్చామనీ, ఇటువంటి చేతగాని వాళ్ళకు ఏపని చెబుదామన్నా భయంగానే ఉన్నదనీ,—రేపటి నుండీ వాళ్ళు ప్రచారం ప్రారంభిస్తారు. వినేవాళ్ళకు గూడా ఇది సబబుగానే ఉంటుంది. ఇప్పుడు నే ననుభవిస్తున్న అపనిందకంటే, అవమానకరమైన నిందకు, అప్పుడు తలొగ్గక తీరదు. ఇంతదూరం ఆలోచించే, నే నా ఉద్దేశాన్ని మార్చుకొన్నాను"

"చెడ్డచిక్కే వచ్చిందే!" అని రుసరుసలాడింది ఉమ. "మార్చుకొంటే, చెడ్డప్రచారం. ఉంచుకొంటే అపనిందలు. —దీనికి తగ్గ ప్రతిక్రియ మీరు చెయ్యలేరుటండీ? వాళ్ళ తలతిక్క వదలగొట్టే ఉపాయమొక్కటి ఆలోచించండి. ఆ సరస్వతి లక్ష్మి, వాళ్ళముందర తలెత్తుకొని తిరగలేకపోతున్నాను."

"కనీసం నీకోసమనైనా చూస్తాను" అన్నాడు శివుడు.

"ఈ హాస్యానికేమి లెస్తురూ..." అంటూ లోపలికి వెళ్ళిపోయింది పార్వతి.

3

గుణనిధి అలా నడిచిపోతూనే ఉన్నాడు. రాజలాంఛనాలన్నీ కోటలోనే విడిచిపెట్టాడు గనుక అతన్నిప్పు డెవరు గుర్తుపట్టలేరు. రోజులు, వారాలు, నెలలు నడిచాడు. నదులను దాటాడు, పర్వతాలను అధిగమించాడు. వందలాది జనపదాలను దర్శించాడు. చివరి కొక మహారణ్యం చేరుకొన్నాడు. అతని కక్కడ శాంతి గోచరించింది. కొన్ని క్రోసులదూరంవరకూ గ్రామమంటూ లేదు. ఒకవేళ మనస్సు మళ్ళీ మానవదర్శనం కోరినా, అది లభించనంత దూరం రావాలన్న నిర్ణయంకొద్దీ, అత నీ అరణ్యం ప్రవేశించాడు. అరణ్యాల్లో దొరికే ఆహారంతోనే తృప్తిపడాలి. మనస్సు చేసే వెర్రి వేషాలకు తందానగొట్టే సమాజం లేనందువల్ల, అదిగూడా చెప్పినట్టు వింటుంది. అదీగాక ప్రశాంతిగాగూడా ఉంటుంది.

ఒకటి రెండు రోజులు శ్రమపడి గుణనిధి ఒక కుటీరాన్ని నిర్మించుకొన్నాడు. కాయగసరులు తింటూ కాలం గడపాలనుకొన్నాడు. జీవించినంత కాలమూ, భగవధ్యానం చేసుకోవాలనుకొన్నాడు. ఏ క్రూరజంతువో భక్షిస్తే విచారించవలసిం దేమీ లేదనుకొన్నాడు.

ఎంత త్రోసివేసుకొన్నా గుణనిధికి తన వెనుకటి జీవితం జ్ఞప్తికి రావటం మానలేదు. ఒకప్పుడు మహోన్నతంగా, భోగభాగ్యాలతో తులతూగిన గుణనిధికీ, భికారిగా, ఈ కుటీరంలో ఉన్న గుణనిధికీ మధ్య భేదంకన్న, సన్నిహితత్వమే అధికంగా ఉన్నట్లు అతను అనుభూతి చెందేవాడు. ఎంత ఆలోచించినా అతనికి ప్రత్యుత్తరం లభించని ప్రశ్న ఒకటే మాటిమాటికీ పొడిచి బాధపెడుతుండేది. లోకం ఇలా ద్వంద్వమయం ఎందుకు కావాలి? వెలుగు వెంట నీడ, ఆరోగ్యంవెనుక వ్యాధి, సుఖం పొదిగిటిలో దుఃఖం, విజ్ఞానం అడుగుల్లో మూఢత్వం, నవ్వు ప్రక్కనే విషాదం, ఉండవలసిన అవసరమేమిటి? కాకపోతే ఒకటి అనవచ్చు. చీకటి లేకపోతే వెలుగును గుర్తించడమెలా? దుఃఖం లేకపోతే సుఖంలోని 'సుఖం' అనుభవంలోకి వచ్చేదెలా? నిజమే. మాధుర్యాన్ని మాధుర్యంగా గుర్తించటానికి, చేదు రుచిచూడ నక్కర్లేదు. చేదు రుచి చూడక పోయినా, మాధుర్యం మాధుర్యమే అవుతుంది గానీ పులుపు కాదు గదా? అయినప్పుడు, ఈ అజ్ఞానము, దుఃఖము, మూఢత్వము, వ్యాధి, లోకంలో ఉండటానికిగల కారణం కనుపించదు. ఇప్పుడు లోక మనుభవిస్తున్న యాతనామయ జీవితంలో, ముప్పాతిక మూడు వంతులు, అనుకోనివేవో వచ్చిపడటంవల్లనే జరుగుతున్నవి. ఎంత ప్రయత్నించినా, యాతనామయ జీవితపుటునికి సమర్థనీయం కావటం లేదు. ఏదో ఒక కారణం—వీటన్నిటికీ మూలమైన

కారణం—ఒకటి ఉండివుండాలి. ఆ కారణం కనుగొంటే, జీవిత సూత్రం చేజిక్కినట్లే!

గుణనిధి, ఆ మహత్తరమైన కారణాన్ని గురించి ఆలోచించ సాగాడు. ముందు తననుండి ప్రారంభించాడు. సంవత్సరం క్రిందట—తను ఎలా ఉన్నాడు? ఎలా ఉన్నాడో గుణనిధి ఊహించుకొన్నాడు. ఈనాడు ఎలా ఉన్నాడు? ఎలా ఉన్నదీ తెలిసిపోయింది. నూరు సంవత్సరాల క్రిందట తన తాత ఉన్నాడు. ఏభై ఏండ్ల క్రిందట తండ్రి ఉన్నాడు. ఈనాడు తను ఉన్నాడు. కాని నూరు సంవత్సరాల క్రిందట ఉన్న తన పితామహుడు, ఈనాడున్న తనను చూడలేడు. సంవత్సరం క్రిందట రాజభోగాలతో తులతూగుతున్న తను, ఈనాటి "తనను" చూడలేడు. కారణ మేమిటి?

ఏదో ఆలోచన మనస్సులో గిలగిల కొట్టుకొంటోంది. వెలికి రావాలని ప్రయత్నిస్తోంది. కాని ఏవో అడ్డంకులు. సంవత్సరం క్రిందటి 'తనను' చూసుకొన్నాడు గుణనిధి. ఈనాటి 'తనను' చూసుకొంటున్నాడు. అయితే రేపటి 'తను' ఎలా ఉంటాడు? ఏమౌతాడు? గుణనిధికి ఏదో సూత్రం దొరికినట్లయింది. మనస్సులో గిజగిజలాడుతున్న ఆలోచన, అవరోధాల నధిగమించింది. మానవుడు గతాన్ని చూడగలడు. వర్తమానాన్ని చూడగలడు. భవిష్యత్తునే దర్శించలేకపోతున్నాడు.

"లోకంలో ఉన్న చాలా అనర్థాలకు, బాధలకు, యాతనలకు ఉన్న కారణం ఇదే! మానవుడు భవిష్యత్తులోకి తొంగిచూడలేడు. ఆ శక్తే మానవహస్తగతమైతే, ప్రపంచం ఎంతో సుఖపడుతుంది." అనుకొన్నాడు గుణనిధి.

తనకు సంవత్సరం క్రిందటే, ఇప్పటి పరిస్థితి తెలిస్తే తన దేశం ఇంతగా అరాజకం గాదు. మహానది వరదలలో బీభత్సకేళి చేయకముందే, తన ప్రజలందరినీ సురక్షితప్రాంతాలకు తరలించి ఉండేవాడు. మిత్రావసు సైన్యాలను సరిహద్దు దాటకముందే, తుత్తునియలు చేసిఉండేవాడు. దురదృష్టం. తనకా శక్తి లేదు.

* * * *

"ఇక నువ్వు తలెత్తుకొని తిరగవచ్చు" అన్నాడు శివుడు పని మాలి భార్యను ఆపి.

"ఏదైనా తిరుగుడు ఆలోచించారా?"

"తిరుగులేనిది మళ్ళీనా..." అన్నాడు శివుడు. "బ్రహ్మవిష్ణులు ఏ ప్రచారమైతే నన్ను గురించి చేస్తారనుకొన్నానో, అదే ప్రచారాన్ని వారికంటె ముందే నేను ప్రారంభిస్తాను. వాళ్లు అసమర్థులు గనుకనే ఈ శాఖను నిర్వహించలేక నాకప్పగించారంటాను."

తన భర్త ఇంత చప్పని ఆలోచన చేస్తాడని పార్వతి అనుకొని ఉండదు. ఆవిడ ముఖం తృణకాలం నల్లబడిపోయింది. శంకరుడది గమనించి,

"నీకీ ఆలోచన నచ్చినట్లు లేదే!" అన్నాడు.

పార్వతి మాట్లాడలేదు.

"పోనీ నువ్వు చెప్పరాదూ! నువ్వేమో నీకు పట్టనట్టుగా ఉంటావు. పిసరంతైనా ఆలోచించవు. ఆలోచించి చెప్పినవాటి కేమో మూతి విరుస్తావు. నీతో ఎలా వేగడం? ఇంతకన్నా ఘనమైన ఆలోచన నాకు రాదు. ఆలోచించటం నావల్ల గాదు. ఓపిక ఉంటే కాస్త నాకోసం ఆలోచించు. లేదా—నువ్వు నోరెత్తకు. నా గొడవ నేను పడతాను" అన్నాడు శివుడు సీదాగా అలిసిపోయి.

తన కేదో సూత్రం తెలిసిపోయింది గాని, అది మాత్రం బైట పెట్టనన్న అర్థంలో పార్వతి మాట్లాడింది. తన చాకచక్యంవల్ల అంతకన్నా మంచిసూత్రం ఇక ఉండబోదన్న విశ్వాసం భర్తకు కుదిర్చింది. శంకరుడు అదేమిటో చెప్పమని అడిగాడు. గంటసేపు బ్రతిమిలాడించుకొని గాని పార్వతి ఆ 'గుట్టు' వెళ్ళగక్కలేదు.

"బ్రహ్మదేమిటి లెండి. ముసలాడు. ఉన్న తలతిక్కంతా ఆ విష్ణుదగ్గరే ఉంది. మీరు ఆ విష్ణుకే ఎసరుపెట్టాలి" అన్నది పార్వతి.

"అదే! ఎలా?" అన్నాడు శివుడు.

"వస్తున్నాను" అన్నది పార్వతి. "స్థితికారుడు అతనేగదూ! దాన్ని మీరు మార్చాలి. మానవులు—ముఖ్యంగా పీక్లేగా మనల్ని ఆడిపోసుకొంటున్నది! ఈ బాధలన్నీ పడటానికి కారణం, ముందేమి జరుగుతుందో తెలీకపోవటం. ఫలానాప్పుడు, ఫలానాచోట, ఫలానా అపాయం జరుగుతుందని, ఫలానావాడికి ముందే తెలిసిపోయిందనుకోండి. వాడా అపాయాన్ని సులభంగా తప్పించుకొంటాడు. సుఖంగా జీవిస్తాడు."

ఇలా పార్వతి చెప్పుకుపోతున్నది. సగంనుండీ చిరునవ్వు నవ్వుతున్న శంకరుడు రానురాను నవ్వు పెద్దదిచేసి, చివరికి పొట్ట చేత్తో బట్టుకొని నవ్వాడు. గంగాదేవి జటాజూటాన్ని పట్టుకోకపోతే ఆ నవ్వు అదురుకు కిందపడిపోయేది. నెలవంక ముఖంమీదికి జారి, తిరిగి సర్దుకొంది. చాలా సేపటికి గానీ, శంకరుడు మామూలు శంకరుడు కాలేదు.

"ఇదిటే నీ ఆలోచన! దీనికేనా ఇంతసేపు బ్రతిమిలాడించుకొన్నదీ! అహఁ. అందుగ్గాదు. ఇటువంటి దిక్కుమాలిన ఆలోచన నీకొచ్చినందుకు చెబుతాను. జీవితాన్ని నడిపేది విష్ణువాయె. అందులో ఏమున్నా లొసుగులొస్తే భరించవలసింది అతనేవాయె. ఆ శాఖని తీసేస్తే, ఆ వొచ్చే మంచితనం అతనికి చెందుతుందిగానీ, నాకెలా చెందుతుంది?" అన్నాడు శివుడు; తన భార్య తెలివి తక్కువతనాన్ని కనిపెట్టేశానన్న సంతోషంతో.

కానీ పార్వతివద్ద దీనికి తగ్గసమాధానం సిద్ధంగానే ఉంది.

"మీరిలాంటి తెలివితక్కువ ప్రశ్న వేస్తారని అనుకొంటూనే ఉన్నాను. అలాగే అడిగారు...అది గాదండీ—వచ్చే కష్టాలు తెలుసుకొని సుఖపడేవాడు; వచ్చే మృత్యువును గూడా తెలుసుకొంటాడుగదా! తెలుసుకొని తప్పించుకొంటాడుగదా! అలా తప్పించుకోవటమే జరిగినప్పుడు భూలోకంలో ఇక మృత్యువు ఉండటానికి తావెక్కడిది? లయమే లేనప్పుడు లయకారకులైన మిమ్మెన్నలా తప్పపడతారూ!" అన్నది పార్వతి దబాయింపు గొంతులో.

శంకరుడు కుక్కిన పేనయ్యాడు. ఏదో సమర్థించుకో బోయ్యాడు గానీ, పార్వతి ఆ పప్పు ఉడకనివ్వలేదు.

"అయితే భూలోకవాసు లందరికీ, ఆ వరం పారేయ మంటావా?" అన్నాడు శంకరుడు.

"ఏమో నాకు తెలీదు. మీ యిష్టం" అన్నది ఉమ.

"అందుకే నువ్వంటే నాకు చిర్రెత్తుకొస్తుంది. ఏది చెయ్యాలో నువ్వు చెబితివి. ఎట్లా చెయ్యాలో నన్ను చెయ్య మంటుంటివి. ఇందులో ఏమన్నా అర్థముందీ? ఎట్లా చెయ్యాలో తెలిసిన వాడికి, ఏమి చెయ్యాలిసిందీ యెందుకు తెలియదో నాకర్థం కావటంలేదు" అని కోపగించుకొన్నాడు శివుడు.

అది కోపానికిమల్లే లేదు గావును—పార్వతి నవ్వింది.

"మీర నేది, మీకు ఎట్లా చేయవలసిందీ తెలియద నేనా?" అన్న దావిడ నవ్వు నాపుకొంటూ.

ఎట్లాగైనా భర్తచేత 'అవును' అనిపించుకొందామని పార్వతి సరదాపడ్డది మొదట. కానీ భర్తగారి దీనాననం చూసి, ఆ సర దాను చంపుకొన్నది.

"మీరేది చేసినా ఉప్పెనగానే ఉంటుంది. అందరికీ ఒక్క సారి పారేస్తే ఏమౌతుందో ఏమిటో? ముందు—కాస్త యోగ్యుణ్ణి చూసి ఇవ్వండి. సత్ఫలితం కలిగితే తతిమ్మావాళ్ళ కివ్వొచ్చు."

శంకరుని క్కూడా ఈ సలహా నచ్చింది.

* * * *

తరువాత శంకరుడు యోగ్యునికోసం అన్వేషణ ప్రారంభిం చాడు. ప్రమథగణాన్ని భూలోకంలోకి పంపుతూ "ఉత్తముడైన వాణ్ణి వెదకండి. మనం చేయబోతున్న పని మహా క్లిష్టమైనది, అందుచేత చాలా రహస్యంగా ఉంచండి. నేనే వెదుకుదును గానీ, నాకేమీ తీరిక లేకుండా ఉన్నది. వెళ్ళిరండి" అన్నాడు శంక రుడు.

ప్రమథులు 'చిత్త'మని సెలవు తీసుకొన్నారు.

* * * *

గుణనిధి తపస్సు పరాకోటి నందుకొన్నది. అతని తపశ్శక్తి దేవలోకం దద్దరిల్లిపోతున్నది. స్వతహాగా తపస్సంటే గుణనిధికి ఇష్టంలేదు. కానీ అది తప్ప మరొక గత్యంతరం లేకపోయింది. అప్పటికే అతను మానవాతీతుడైనాడు. సర్వోద్రేకాలు, లోభ మోహాలు అంతరించాయి. 'రేపును'గురించి 'ఈనాడు' ఆలోచించే వాడు. 'రేపు'—'ఈనాడు'లాగా లేకపోయేది. తనకింకా భావి దృష్టి రాలేదనుకొనేవాడు. తిరిగి తపస్సు చేసేవాడు. ఈవిధంగా నెలలకు నెలలు దొర్లిపోతున్నాయి. ఫలితంలోమట్టుకు మార్పు ఉండేదికాదు. రాను రాను గుణనిధి తీవ్రంగా తపస్సుచేయసాగాడు. అతని తపోధాటికి దేవలోకం హడిలిపోతోంది.

* * * *

"మరొక రహస్యం!" అన్నాడు శివుడు భార్యనుద్దేశించి.

"ఏమిటది?"

"ఖచ్చితంగా మనకు కావలసిన మనిషే దొరికాడు. భూలోకంలో గుణనిధి అనే రాజొకడు, భావిదృష్టికోసం తపస్సు చేస్తున్నాడు. దేవమండలికి ఈ విషయం తెలిసిగూడా పట్టించుకో లేదు. ఇంతకంటే సదవకాశం మనకు దొరుకుతుందని నేననుకోను. అతని కాశక్తి నిద్దామనుకొంటున్నాను. నీ ఉద్దేశమేమిటి?"

"ఇది మరీ బాగుంది!" అన్నది పార్వతి. "మీకంటే నా కెక్కువ తెలుసునా? అలాగే ఇవ్వండి. మరొకరైతే ఒరగబెట్టే దేమిటి? గుణనిధి ఒరగబెట్టం దేమిటి?"

4

గుణనిధి ఉలిక్కిపడ్డాడు. ఎక్కడో తీవ్రమైన సంచలనం జరుగుతున్నట్టు పసికట్టాడు. ఎక్కడ జరుగుతోంది? గుణనిధి చుట్టూ కలయచూశాడు. అంతా ప్రశాంతంగా ఉన్నది. అయితే ఈ కలవరపాటుకు కారణ మేమిటి? అంతా నూతనంగా, చిత్రంగా ఒకదానిలో ఒకటి మిళితమయిపోయినట్లు, రంగురంగుల చిక్కవల లాగా ఉన్నది. కొంప తీసి తనకు...

గుణనిధి ఒకసారి తీవ్రంగా కంపించిపోయాడు. మెదడులో వెలుతురు మోసులెత్తినట్లు అనుభూతి పొందాడు. 'రేపు'నుగురించి ఆలోచించాడు. కళ్ళముందు తెర తొలగినట్లయింది. కొన్ని క్షణాలు అంతా గజిబిజిగాఉంది. రేపులో, గుణనిధి అరణ్యంలో నుండి పోతున్నాడు. అతని ముఖాన చిరునవ్వు చిందులాడు తున్నది. ఉత్సాహంతో అడుగులు వేసుకొంటూ పోతున్నాడు. 'గాండ్రు'మన్న ధ్వని వినిపించింది. పొదలు కదిలాయి. భయంతో గుణనిధి వణికిపోయాడు. 'తన విజ్ఞానమంతా నశించవలసిందేనా!' అని ఖేదపడ్డాడు. లేనిసత్తువ తెచ్చుకొని గబగబా చెట్టెక్కాడు. ఇంతలో మరొక దెసనుండి అటువంటి ధ్వనే వినిపించింది. రెండు పులులూ ఎదురుపడ్డాయి. ఘోరంగా పోరాడుకొన్నాయి. గుణనిధి చెట్టుమీదనుండి ఇదంతా చూస్తూనేఉన్నాడు. ఇంతలో ఒక పులి తీవ్రంగా గాయపడి, ప్రాణరక్షణార్థం కాబోలు పరుగుపుచ్చు కొంది. రెండవ పులి దాన్ని తరుముతూ వెంబడించింది. మృగ ద్వయం దూరం వెళ్ళిపోయినట్టు రూఢికాగానే గుణనిధి చెట్టు దిగి, తిరిగి త్రోవపుచ్చుకొన్నాడు:—

"రేపు నాకు ఈవిధంగా జరుగుతుందన్నమాట. ఒకవేళ నేను ప్రయాణం చేయకపోతేను...?" అనుకొన్నాడు గుణనిధి.

* * * *

"కొరివితో తల గోక్కున్నట్లయింది" అన్నాడు పరమేశ్వ రుడు చీకాకుగా.

"ఏమి జరిగిందేమిటి?" అన్నది పరమేశ్వరి, ఏదో పీకమీది కొచ్చిందనుకొంటూ.

"ఆడదానిమాట వింటే ఏదైనా జరుగుతుంది—నువ్వేదో తెలివిగలదాన వనుకొన్నాను...నీ మాట విని గుణనిధికి శక్తి నిచ్చాను...ఇన్నిటికీ నిన్నననవలసిందేమీ లేదులే! నీకు తోచిం దేదో నువ్వన్నావు. ఆ మాట నమ్మమని ఎవరు చెప్పారు?" అన్నాడు తనలో తాను అనుకొంటున్నట్లు.

"పార్వతి కిమ్మనలేదు."

"ఈ మానవులంత సందేహజీవులు ఏ లోకంలోనూ లేరు. అనుమానాలతో లుకలుకలాడిపోతున్నారు మనుషులు. అన్నీ ప్రశ్నలే, అన్నీ అనుమానాలే......ఛీ ఛీ" అని అసహ్యించుకొన్నాడు శివుడు. "గుణనిధి అరణ్యం దాటి ఒక పల్లె చేరుకొన్నాడు. ఒకాయన ఆతిథ్యమిచ్చాడు. గుణనిధి సంతోషంతో అంగీకరించాడు. భోజనానంతరం, అతగాడు తీరిగ్గా కూచుని, 'భావి'లోకి చూశాడు. ఆ గృహయజమాని మూడు రోజుల్లో, బందిపోటు దొంగలచేత హత్యచేయబడతాడని తెలిసింది. ఆ విషయమే అతనితో చెప్పాడు గుణనిధి. గృహమేధి నమ్మలేదు. నమ్మలేదు సరిగదా గుణనిధి దొంగలతాలూకు మనిషేమో నని అనుమానించాడు. కాకపోతే, అంత ఖచ్చితంగా ఎలా చెబుతాడని, గృహయజమాని సందేహించాడు. గుణనిధిని తన్నబోయాడు. అదృష్టవశాత్తూ ఇరుగుపొరుగులు అడ్డువచ్చి, గుణనిధిని విడిపించారు. నా కెక్కడి విచారమేస్తున్నదంటే, నిజం చెబుతున్నా ఈ మనుషులు ఎందుకు గ్రహించలేరా అని!"

"అది నిజమని వారికి తెలీదు గనక" అనుకొన్నది పార్వతి. "అయితే ఏం చేదామంటారు?"

"అదే తోచడంలేదు...ఏం చేస్తే బాగుంటుందని నువ్వనుకొంటున్నావో ముందు చెప్పు."

పార్వతికి చక్కని అవకాశం దొరికింది.

"ఆఁ నా ముఖం. నేనో తెలివితక్కువ దద్దమ్మను. నే నేమనుకొంటే మట్టుకేం లెండి" అని ఎత్తిపొడిచింది.

శంకరుడు కొన్ని నిముషాలపాటు మౌనంగా ఉండి, తరువాత యిలా అన్నాడు:—

"ఏదో ఒక విచిత్రం ఉంటేగాని, మానవుడు విశ్వసించడు. అందుకని అతనికి మరొక నేత్రం ప్రసాదిద్దామనుకొంటున్నాను. ఆ మూడవ నేత్రం భవిష్యత్తులోకి చూడగలిగేటట్లు ఏర్పాటు చేస్తాను. మామూలు మనుషులకు భిన్నంగా, అపురూపంగా ఉంటాడు గనుక, అప్పుడు గుణనిధి మాటలను ప్రజ విశ్వసించవచ్చు. అవునా?" అన్నాడు శంకరుడు.

"మీకు నేను చెప్పతగననుకోండి..." అంటూ ప్రారంభించింది పార్వతి.

"అయినా చెప్పు. వింటాను—" అన్నాడు శివుడు.

"గుణనిధికి తన గతాన్నిగురించే తెలుసు గాని, లోకంలో ఉన్న వారందరి గతాలనుగురించీ తెలీదుగదా?"

"నిజమే, తెలీదు. అయితే?"

"అతను చెప్పే భవిష్యత్తు సరైనదని ప్రజ లెలా నమ్ముతారు? ఇత నెలా నమ్మించగలడు?"

"ఈ సమస్య ఇక తేలదు" అని నిస్పృహను ప్రకటించాడు శివుడు.

భర్త ఇంతగా నీరసించిపోవటం పార్వతికి ఇష్టంలేదు. లక్ష్మీ సరస్వతులవద్ద, రవంత తలెత్తుకొని తిరగడానికైనా, శివుని చేత ఓ ఘనకార్యం చేయించాలి. ఇత నేమో చేతులు వెల్లకిలవేస్తున్నాడు. భర్తకు ఇష్టమై అపవాదులు భరిస్తే భరించవచ్చు. తన కేమీ అభ్యంతరంలేదు. కానీ తను అలా కాదు. కనీసం తనకోసమన్నా శంకరుణ్ణి ఉత్సాహింప చేయవలసిన అవసరం ఉన్నది. అందుకని—

"తేలకేమిటి చేస్తుందిలెండి" అన్నది పార్వతి.

శంకరుడు ఆశగా చూశాడు.

"అతనికి—అదే—గుణనిధికి; ప్రతివారి గతాన్నీ తెలుసుకొనే శక్తికూడా ఉండాలి. గత చరిత్రను ఖచ్చితంగా చెప్పగలిగినవాడు, భవిష్యత్తును గూడ చెప్పగలడన్న నమ్మకం ప్రజలకు సులభంగా కలుగుతుంది. అతని మాటలు అక్షరాలా పాటిస్తారు. తరువాత ఫలితం మనకు తెలిసిందేనా..." అన్నది పార్వతి.

"సరే" అన్నాడు శంకరుడు.

"మీరుగూడా ఆలోచించండి. చివరికి నెపం నామీదకేస్తే నే నొప్పుకోను."

"చెయ్యటానికిమట్టు కేముందిలే" అన్నాడు శివుడు. "ఇతనుగూడా, నాలాగ త్రినేత్రుడైనాడు. ఒకకన్ను గతాన్ని చూస్తుంది. మరొక కన్ను వర్తమానాన్ని చూస్తుంది. ఇంకొకటి భవిష్యత్తును దర్శిస్తుంది. భేష్ బావుంది."

"గుణనిధిగూడా త్రినేత్రుడయ్యాడు గానీ, మీలాగా మాత్రం కాదు."

ఎంత ఆలోచించినా ఈ మాటలకు అర్థం శివునికి స్ఫురించనే లేదు.

* * * *

కొంతకాలం దైహికసంబంధమైన శ్రద్ధ లేకపోవటంచేత, గుణనిధిని ఇప్పు డెవ్వరూ గుర్తుపట్టలేరు. మీసాలు, గడ్డాలు పెరిగాయి. జుట్టు జడలు కట్టుకుపోయింది. అపూర్వమైన రెండు శక్తులు అతని స్వాధీనం కావటంచేత, శరీరం వింతకాంతితో మిలమిలలాడుతుండేది. ముఖాన దివ్యతేజస్సు ప్రస్ఫుటిస్తుండేది. అతనికి రాజరికంమీద, భోగాలమీద, ఆసక్తి పూర్తిగా నశించిపోయింది. ఈ దేహం అశాశ్వతమైనదని అతనికి తెలుసు. 'పరమహంస' పంజరంనుండి వెళ్ళినతరువాత ఈ కట్టె ఎందుకూ పనికి రాదని అత డేనాడో గ్రహించాడు. బ్రతికిన నాలుగునాళ్ళు, లోకాని కింత ఉపకారంచేసి దాటిపోవడం మేలనుకొన్నాడు. అందులోనూ తనకు మహత్తరశక్తులు లభించాయి. వీటి సాయంతో, ఈ "యాతనామయ జగత్తు"ను స్వర్గసీమ చేయవచ్చుననుకొన్నాడు. తన సేవ మానవజాతికై నిర్దేశింపబడ్డది గనుక, అరణ్యవాసం ఇక పనికిరాదనుకొన్నాడు. 'లోకం'లోకి వచ్చాడు.

ప్రజలు గుణనిధి చుట్టూ తండోపతండాలుగా మూగపడ జొచ్చారు. ఇంతవరకూ వారు చూచింది రెండు నేత్రాల మానవులనే! గ్రంథాలలో మాత్రం, శంకరునికి మూడు నేత్రాలనీ, దేవేంద్రునికి సహస్రనేత్రాలనీ...చదివారు. కానీ చూడలేదు. ఈనాడు ఈ "వేసికన్నులదొర" ప్రత్యక్షమైనాడు. ఇతను దేవాంశసంభూతుడని కొందరనుమానించారు. మరికొందరు సాక్షాత్తూ

ఆ పరమేశ్వరుడే ఇలా భూలోకంలో అవతరించాడని రూఢిచేసుకొన్నారు. కొందరు ఈ రెండువాదాలనూ ఖండించారు. దేవతలు అనిమిషులు. ఇతను కాడు. ఇది వారివాదన. "లోకంలో అనేక రకాలయిన ప్రాణు లుద్భవిస్తూ ఉంటాయి. ఆరుకాళ్ళ ఆవులు, మూడుతలల ఎద్దులు ఎన్నో వస్తున్నాయి. వచ్చాయి. అంతమాత్రాన ఇవన్నీ దేవాంశ సంభూతాలే అవుతాయా?" అన్నారు వారు. దీనికితోడు గుణనిధికూడా తాను మానవుడనేననీ, తపోబలంవల్ల వీటిన్ని సాధించానని చెప్పుకొన్నాడు. నమ్మినవారు నమ్మారు. దేవుడుగా ఆరాధించినవారు ఆరాధించారు.

5

మానవుల్లో ఇంతటి కుళ్ళు ఉంటుందని గుణనిధి కనీసం — కలగని ఉండడు. అతని కిలాంటి శక్తులున్నాయని తెలిసినప్పటి నుండీ, మరిన్ని మహత్తులు ఆరోపించి, తమతమ ఇబ్బందులన్నీ తీర్చమని అతన్ని చుట్టు ముట్టసాగారు. దురదృష్టమేమిటంటే — గుణనిధికి, భూతభవిష్యద్విషయాలే తెలుసుగానీ, వాటిని తొలగించటం తెలియదు. ఫలానా రోజున ఫలానా మనిషికి ఫలానా గండమున్నదని చెప్పగలడు. చెప్పి నమ్మించనూ గలడు. ఈమాత్రం చెప్తే తను — ఆ అపాయాలనుండి వారే సులభంగా రక్షణ ఏర్పాటు చేసుకోగలరని అతనూహించాడు. కి విరుద్ధంగా ఇప్పుడు జరుగుతున్నది. ఆ అపాయలనుండికూడా అతనే రక్షించాలని ప్రజలు పట్టుబడుతున్నారు. 'ఆ శక్తి నాకు లేదు. మొర్రో' అంటున్నా వారు వినిపించుకోవటంలేదు. దీనికి ప్రతిక్రియ ఏమిటో గుణనిధి చెప్పలేకపోతున్నాడు.

ఒక రోజున ఒక వ్యక్తి గుణనిధి దగ్గరకొచ్చి, "స్వామీ! నాకు ఒక్కడే కొడుకు. విద్యాభ్యాసంచేసి ఇటీవలే ఇంటికొచ్చాడు. అతనికి వివాహం చేయాలనుకొన్నాను," అని చెప్పబోతున్నాడు.

"నాకు తెలుసు" అన్నాడు గుణనిధి. "నీ కేమో విద్యావతి కోడలుగా కావాలంటున్నావు. నీ భార్య సంపన్న యువతి కావాలంటున్నది. నీ కొడుకు రూపవతి కావాలంటున్నాడు. గత మూడు మాసాలనుండీ, మీరు ముగ్గురూ ఈ విషయంమీద వాదోపవాదాలు జరుపుకొన్నారు. 'నామాట వినకపోతే, నా యింటికి రావవసరం లేదని' అన్నావు. 'నామాట వినకపోతే, నేను పుట్టింటికి పోతా,' నని నీ భార్య బెదిరించింది. 'ఏ కురూపినో బలవంతాన కట్టబెట్ట ప్రయత్నిస్తే, నేను ఆత్మహత్య చేసుకొంటా,' నని నీ కొడుకన్నాడు. అవునా?"

ఆ వ్యక్తి భక్తితో, భయంతో వణికిపోయాడు. గుణనిధి రెండు కాళ్ళూ పట్టుకొని, కళ్ళకద్దుకొన్నాడు.

"స్వామీ! తమరు త్రికాలవేదులు. మీకు తెలియనిదంటూ ఈ ప్రపంచంలో ఏమీలేదు. చదువుల సరస్వతి అనదగ్గ కన్య నొకదాన్ని నేను మాట్లాడాను. మా కుర్రవానికి ఆ కన్యతో ఎప్పుడు వివాహమౌతుందో దయచేసి చెప్పండి" అని ప్రార్థించాడు.

గుణనిధి మూడవ నేత్రంతో భవిష్యత్తులోకి చూసి, దీర్ఘంగా నిశ్వసించాడు. అతని వదనం మ్లానితమైంది. కన్ను లశ్రుసిక్తాలైనాయి.

ఆగంతకుడు గతుక్కుమన్నాడు.

"ఏమిటి స్వామీ! ఆకన్యతో మావాడికి పెండ్లి కాదంటారా"

"కాదు"

ఆగంతకుడు నిట్టూర్చాడు.

"లక్ష్మీసంపన్నురాలవుతుందంటారా!"

"కాదు"

ఆ వ్యక్తి ఆశ్చర్యపడ్డాడు.

"కాక — రూపవతితోనే వివాహమవుతుందని తమ భావమా?"

"కాదు"

"మీ హృదయాన్ని నే నర్థంచేసుకోలేక పోతున్నాను" అన్నాడు భయంగా ఆగంతకుడు.

"అతనికి వివాహమే కాదు"

"ఎప్పటికీనా?"

"వివాహప్రయత్నాలన్నీ జరుగుతాయి. విద్యారూపసంపన్నురాలైన కన్య దొరకుతుంది. కానీ, నాయనా, వివాహం జరుగదు......"

"అభ్యంతరం లేకపోతే..." నసిగాడతను.

"వివాహానికి కొన్ని రోజులు ముందు, నీ కొడుకు నావికా విహారార్థియై నదిలో పోతుంటాడు. మొసలి వాతపడతాడు."

ఆ వ్యక్తి భోరుమని ఏడ్చాడు. గుణనిధి రెండు కాళ్ళూ పట్టుకొని "ఎలాగైనా నా కొడుకును రక్షించం"డని ప్రాధేయపడ్డాడు. విలవిలలాడాడు.

"మరణ కారణ మేమిటో మీకు చెప్పాను. ఆ కారణం రాకుండా చూసుకోండి. సత్ఫలితం కలగవచ్చు."

* * * *

ఇలా ఊరూరూ తిరుగుతూ, కుంతలకేశి వచ్చాడు గుణనిధి. ఈప్రాంతాని కతను రావటం ఇదే ప్రథమం. కుంతలీయులకు గుణనిధి విషయం సంపూర్ణంగా తెలియదు. కాని, దైవశక్తులున్న విచిత్ర మానవు డొకడు ఇతర రాజ్యాల్లో పర్యటిస్తున్నాడనీ, భూత భవిష్యద్విషయాలను, కరతలామలకంగా చెబుతున్నాడనీ గాలివార్తలు విన్నారు. అతనిటేపు వస్తే బాగుండునని కొందరనుకొన్నారు. కొందరు స్వయంగా వెళ్ళి ఆహ్వానించాలనుకొన్నారు.

గుణనిధి ఒక్కొక్క గ్రామాన్ని చూసుకొంటూ, వారికి గత విషయాలను చెప్పి నమ్మక కలిగిస్తూ, భవిష్యత్తును సూచిస్తూ ప్రయాణాలు చేస్తున్నాడు. అతనికి 'కాలం' చాలడంలేదు. ఒకొక్క చోట వారాలకొద్దీ ఉండిపోవలసివస్తున్నది. వేలాది ప్రజలకు చెప్పవలసిరావడంతో, అతను అలిసిపోతున్నాడు.

విశ్రాంతి తీసుకొనేటందుకుగూడా వీలుదొరకటంలేదు.

ఒకచోట ఒక గృహస్థు తారసిల్లాడు. కూతురు గర్భవతి. మనుమడో మనుమరాలో తెలుసుకొందామన్న ఉబలాటంతో గుణనిధిని సంప్రదించాడు.

"నాకు తెలిసిన విషయం చెప్పకపోవటం దోషం. చెప్పి మీ మనశ్శాంతిని భగ్నం చెయ్యటానికి ఆత్మ అంగీకరించటంలేదు" అన్నాడు గుణనిధి.

"ఇబ్బందిలేదు చెప్పండి." అన్నాడు గృహస్థు.

"నా మాటలమీద మీకు సంపూర్ణ విశ్వాసమున్నదిగదా?" అన్నాడు గుణనిధి.

గృహస్థు "ఉన్న"దన్నాడు.

"నీ కూతురు సుఖప్రసవం కాదు. ప్రసవసమయంలో చనిపోతుంది. ఈ వియోగం భరించలేక నీ అల్లుడు, విరాగి అయిపోతాడు. కూతురు దిగులుతో నీ భార్య మంచమెక్కి నవసి నవసి చచ్చిపోతుంది. నేటికి సరిగ్గా, అయిదు నెలలకు నేను చెప్పినవన్నీ జరుగుతాయి."

ఆ గృహస్థు హృదయవిదారకంగా రోదించాడు. 'ఎలాగైనా నా కుటుంబాన్ని రక్షించ'మని వేడుకొన్నాడు. గుణనిధి హృదయం కరుణ రసప్లావితమైంది. కానీ అతను చేయగలిగిందేమీ లేదు. ఎంతో శ్రమమీదగానీ, ఆ గృహస్థు ఇంటికెళ్ళలేదు.

అతరువాత గుణనిధి చాలాసేపు ఆలోచించాడు. తనదగ్గర కొచ్చేటప్పుడు అతను ఎంతో సంతోషంతో, బంగారు కలలు కంటూ వచ్చాడు. తను చేసిందేమిటి? హృదయభేద్యమైన విచారాన్ని అతనికి కలిగించి పంపాడు. ఇందువల్ల ఆ గృహస్థు లాభించిందేమీ లేదు. లేకపోగా, మరొక అయిదు నెలలకు విధిగా అనుభవించవలసిన దారుణానుభవాలను, ఇప్పటినుండే అనుభవిస్తున్నాడు. ఇది అతన్ని రక్షించటం కాదే!

ఇప్పుడా గృహస్థు ఏమి చేస్తున్నాడా అని గుణనిధి చూశాడు. అతను గోడవానుకొని విచారిస్తున్నాడు. కూతురు పొట్ట మీద బాదుకొంటూ నేలమీద దొర్లుతున్నది. భార్య గుండెలు పగిలేలా రోదిస్తున్నది. అల్లుడు తల గోడకేసి కొట్టుకొంటున్నాడు.

"ఘోరం" అనుకొన్నాడు గుణనిధి.

"ఆకుపచ్చని కలలాగా, అందంగా గడిచిపోతున్న వారి జీవితాల్లోకి నిప్పురవ్వను విదిపాను."

* * * *

కుంతలదేశాధీసుడైన సమరసేనుని కివాళ బొత్తిగా తీరిక లేదు. మరొక రెండు రోజులలో అతని జన్మదినోత్సవాలు జరుగుతాయి. దేశమంతటా ఈ ఉత్సవాలు జయప్రదంగా నిర్వర్తింపబడటానికి కావలసిన జాగ్రత్తలు తీసుకోవటంలో సతమతమౌతున్నాడు. ఇప్పటికే రాజధానీనగరం అత్యద్భుతంగా అలంకరించబడ్డది. ప్రత్యేకాకర్షణలుగా, మూడురోజులపాటు కాశ్మీరాంగనల నృత్యహేలలు ఏర్పాటుచేశాడు. సమరసేనుడు వస్తుతః రసహృదయుడు, శృంగారజీవి. ప్రతిసంవత్సరమూ లక్షలాది దీనారాలు ఇందుకోసం వెచ్చింపబడుతుంటాయి. దేశదేశాంతరాల నటులు, నృత్యగాండ్రు, గాయకులు, కవులు, ఆహ్వానింపబడుతుంటారు. సన్మానితులవుతుంటారు. ఈ వేడుకను పురస్కరించుకొని సమరసేనుడు ఇరుగు పొరుగు రాజులను ఆహ్వానించటమూ, వారు ఆనందంతో పాల్గొనటమూ మామూలుగా జరుగుతుంటుంది.

ఈ సంవత్సరంకూడా అలాంటి ఏర్పాట్లన్నీ జరిగాయి. అయినా ఎక్కడన్నా లోపమున్నదేమోనని సమరసేనుడు పరిశీలిస్తూనే ఉన్నాడు. అలాంటి సందర్భంలో సేవకు డొకడువచ్చి 'గుణనిధి తమ దర్శనం కోరుతున్నా' డని చెప్పాడు. సమరసేనుని హృదయం సంతోషంతో గంతువేసింది. 'ఈ సంవత్సరం ఇదొక నూతనా కర్షణ' అనుకొన్నాడు. ప్రవేశపెట్టమని సేవకుని కాజ్ఞ యిచ్చాడు.

* * * *

"మిమ్మల్ని గురించి విన్నాను. ఈనాడు చూశాను. అయాచితంగా వచ్చినందుకు నా ధన్యవాదాలు" అన్నాడు సమరసేనుడు.

ఈరకమైన సంభాషణ గుణనిధికి నచ్చలేదు.

"ప్రభూ!" అన్నాడు గుణనిధి. "మీతో ఒక రహస్యం చెప్పవలసిన అగత్యం ఏర్పడ్డది."

"ఏమి" టన్నట్లు కనుబొమలు కుంచించాడు సమరసేనుడు.

"నావిషయం మీకు తెలుసు...." అవునన్నట్లు సమరసేనుడు తల ఊపడంచేత గుణనిధి చెప్పుకుపోయాడు. "దయచేసి మీరీ జన్మదినోత్సవ ప్రయత్నములను ఆపుచేయండి...ఒక ప్రమాదం సంభవించ నున్నది."

సమరసేనుడు ఉలిక్కిపడ్డాడు.

"ప్రమాదమే!" అన్నాడు తెప్పరిల్లి.

అందరి రాజులతోబాటు మీరు అగ్నిమిత్రుణ్ణికూడా ఈ ఉత్సవాని కాహ్వానించారు."

"ఆహ్వానించాను" అన్నాడు సమరసేనుడు ఏకో జ్ఞాపకం తెచ్చుకొని. అతని నేత్రాలు కాంతిపిచ్ఛలములైనాయి. మందహాసం క్షణకాలం మెదిలి అదృశ్యమైంది.

"దయచేసి మీరా ఆహ్వానాన్ని రద్దుచేయండి. అగ్నిమిత్రుడు సర్వసైన్యాలను తరలించుకొని వస్తున్నాడు. సైనికులను, రాజధానికి సమీపంలో దాచి, తాను మాత్రపు భటవర్గంతో, ఈ మహోత్సవంలో పాల్గొంటాడు. రాజభటులందరూ, ఉత్సవానందములో మునిగిఉండడంచేత, అతని సైన్యాన్ని గుర్తుపట్టలేరు. ఏమరుపాటుగా మీకోటమీదకు లంఘించి దాన్ని వశంచేసుకోవాలని అగ్నిమిత్రుడు ఆలోచిస్తున్నాడు. మిమ్ముల నతడు ఖైదీగా పట్టుకొంటాడు. దేశం అరాజకమౌతుంది." అన్నాడు గుణనిధి.

"నేను నమ్మలేక పోతున్నాను" అన్నాడు సమరసేనుడు. "అగ్నిమిత్రుడు నా ప్రాణ మిత్రుడు. మిత్రద్రోహాని కతడు పాల్పడతాడని, నే నూహించలేను"

"ప్రభూ! ఎవరికీ తెలియని మరొకరహస్యం చెబుతాను. అప్పుడైనా నన్ను విశ్వసిస్తారా."

అంగీకారంగా తల పంకించాడు సమరసేనుడు.

గుణనిధి కొన్ని క్షణాలు భూతకాలపు దృశ్యాలు తిలకించి ఇలా అన్నాడు:—

"గతసంవత్సరం జరిగిన మీ జన్మదినోత్సవానికి అగ్నిమిత్రునితోబాటు, అతని సోదరికూడా వచ్చింది. జగదేక సౌందర్యవతియైన సునంద మీ మనస్సును ఆకర్షించింది. ఆమెను వివాహం చేసుకోవాలని మీరు నిశ్చయించుకొన్నారు. ఆమె అభిప్రాయం కూడా తెలుసుకొందుకు మీరు ప్రయత్నించారు. జ్ఞాపకం తెచ్చుకోండి. ఒకనాటి సాయంత్రం సునంద ఒంటరిగా, మీ ఉద్యానంలో ఉన్నది. అదే సమయమని మీరువెళ్ళి మీ అభిప్రాయాన్ని చెప్పారు. సునందవదనం కోపంతో ఎర్రబడ్డది. అదిమీరు సిగ్గుగా భావించారు. ఆరాత్రే సునంద ఈ విషయాన్ని అన్నతో చెప్పింది. అగ్నిమిత్రుడు ఇది సమయంకాదని ఊరుకొన్నాడు. ఆ తరువాత మీరొక రాయబారినికూడా పంపారు. సరైన సమాధానం మీకురాలేదు. ఆకక్ష అగ్నిమిత్రునిలో దిన దిన ప్రవర్ధమానమౌతూనే ఉంది. ఈనాటికిల్లా పరిణమించ నున్నది... ఇప్పటికైనా నామాట నమ్మరా ?" అన్నాడు గుణనిధి.

సమరసేనుడు ఆశ్చర్యపోయాడు. ఇదంతా నిజమే! అయినప్పుడు భవిష్యత్తుమాత్రం ఎందుకు నిజం కాగూడదు? అతనికొక సందేహం తీర్చుకోవాలనిపించింది. అడిగాడు—

"నాతో వివాహమంటే, సునంద కిష్టంలేదని నే నర్థం చేసుకొంటున్నాను. ఎందు కిష్టంలేదో చెప్పగలరా? "

గుణనిధి ఆలోచించి, 'పోనివ్వండి' అన్నాడు.

"లేదు, తెలుసుకోవాలనుకుంటున్నాను."

గుణనిధి తప్పించుకోవాలని ప్రయత్నించాడు. సమరసేనుడు చెప్పితీరాలన్నాడు.

"ప్రభూ! మీరింత బలవంతం చేస్తున్నారు గనుక, అప్రియమైన సత్యాన్ని చెబుతున్నాను. మీరు అన్యథా భావించకండి." అని కొన్ని క్షణాలు ఆలోచించాడు. "మీతండ్రిగారికి చాలాకాలంవరకూ సంతానం లేదు. సంతానభాగ్యంకోసం ఆయన గారు చాలాపరితపించారు. ఎన్నో వివాహాలు చేసుకొన్నారు. అయినా సంతు కలగలేదు. చివరి ప్రయత్నంగా మీతల్లి గారిని వివాహమాడారు. సంవత్సరాలు గడిచిపోతున్నాయిగానీ, సంతానభాగ్యం కలగలేదు. రాజ్యం దేవాలయాధీనం చేసి తపోభూములకు వెళ్ళిదామనుకొంటున్నారు. ఈసంగతి అంతఃపురానికి తెలిసింది. మీతల్లిగారు రాజ్యం మరొకరిస్వాధీనం కాకుండా చేద్దామనుకొన్నారు. అలా చేయాలంటే, సంతానవతి కావటంతప్ప మరోకమార్గం లేదు. సంతానవతి కావటానికి అవకాశం లేదు. మీ తండ్రిగారు రోగగ్రస్తులవ్వటమే అందుకు కారణం. మొన్న మొన్నటివరకూ సైన్యాధిపతిగా వున్న వీర వర్మ, ఈసందర్భంలో అంతఃపురానికి సహాయం చేశారు. మీరు జన్మించారు. రాజ్యం దక్కింది. ఈ సంగతి అగ్నిమిత్రునికీ అతని సోదరికీ తెలుసు. అందుకే..."

"ఆపు" అని గర్జించాడు సమరసేనుడు. అతని కళ్ళు నిప్పులు చిందుతున్నాయి. పెదవులు బిగపట్టాడు. ఆపాద మస్తకం వణికిపోతున్నాడు.

6

యమకింకరులవంటి భటులు గుణనిధిని పట్టుకొన్నారు. శృంఖలాబద్ధునిజేసి, రహస్య కారాగారంలో బంధించారు. కోటనుండీ ఉత్సవధ్వనులు వినిపిస్తున్నాయి. మంగళవాద్య ధ్వనులు గాలిలో తేలిపోతున్నాయి. గాయకుల మధుర సంగీతం, రాజభటులు హోళాహళి, కరతాళధ్వనులు, మృదంగ నినదము, ఉండి ఉండి గుణనిధికి వినిపిస్తున్నాయి.

* * * *

గుణనిధి నీరసంగా కారాగృహభిత్తికకు జారగిల బడ్డాడు.

"నే నిటువంటి అపూర్వశక్తులకోసం ఎందుకు ప్రయత్నించాను ?"

గుణనిధి తనను తాను ప్రశ్నించుకొన్నాడు.

లోకంలోని - ఎక్కువ బాధలకు కారణం అవి ఆకస్మికంగా రావటమే ననుకోవటం, ఆకస్మికంగా చనిపోవటంకన్న, ఫలాన నాడు చనిపోతానని తెలిసి చనిపోవటం దారుణం; ఇక ముందెప్పుడో బాధలువస్తాయని, ఇప్పటినుంచే, వాటికోసం బాధ పడటం, రానున్న విపత్తులు ముందే తెలుసుకోవడంవల, వాటికి తను చికిత్సలుచేసి, జీవితం సుఖమయం చెసుకోవచ్చునన్న దురూహ (!) తనను పట్టి పల్లార్చాయి. భవిష్యత్తును తెలుసుకోవడంవల్ల అన్ని వేదనలు రూపుమాసిపోతాయని తను విశ్వసించాడు. అందుకోసం ప్రయత్నించి ఆశక్తి పొందాడు. ఫలితం తనను నమ్మకపోవడం. గతాన్ని క్షుణ్ణంగా చెప్పినప్పుడుగానీ, భావిని పూర్తిగా విశ్వసించరు. అప్పుడుగాని అందరూ తన మాట నమ్మరు. అలా నమ్మినప్పుడే ప్రతివారూ, రానున్న శుభా శుభాలను ఇప్పుడే తెలుసుకొని, తగువిధంగా ప్రవర్తించరు. అలా జరిగిన నాడు లోకం ఆనందధామమౌతుంది. స్వర్గసీమ అవుతుంది....

ఇలా అనుకొన్నాడు గుణనిధి. కానీ జరిగింది వేరు. వర్తమానంలో, గౌరవనీయులుగా, పూజనీయులుగా చెలామణీ అవుతున్న పెలమంది గత చరిత్రలు, హేయాతి హేయంగా గుణనిధికి కనుపించాయి. భయంకరమైన హింసలు, దారుణమైన హత్యలు, దోపిడులు, అసత్యాలు, అశ్లీలజీవితాలు, భగ్నప్రణయాలు...లక్ష లక్ష లక్షలు. తీవ్రంగా, నగ్నంగా, గుణనిధికి అర్థమైనాయి. అంతర్బహిర్జీవితాల నడుమ, రహస్యంగా, ఇంత కుళ్ళువుంటుందని గుణనిధి ఊహించలేదు....

భవిష్యత్తు — ఇప్పుడు 'పొదిగిటిలో ఒదిగలబడి' చిరునవ్వు శీకరాలను వెదజల్లే పసిపాప, పాలు త్రాగుతూనే, గావుకేక పెట్టి, రక్తం కక్కుతూ [ముందెపుడో]చనిపోతుందని క్షణానే

తెలిసిన ఆ మాతృమూర్తి హృదయవేదన; మధురాను భూతులతో, రుచిరస్వప్నాలతో, తీవ్ర వాంఛలతో జీవితాలను తృణాలమీద నడిపించే యువమిథునానికి—రెండు సంవత్సరాలలో వియోగం సంభవిస్తుందని ఇప్పుడే తెలిసినప్పటి ఉన్మాదావస్థ; విజయ కాంక్షతో, రణక్షేత్రంలో, వీర విహారం చేస్తున్న సైనికునకు— ప్రభుభక్తి, దేశభక్తి ఉద్దీపనలు కాగా, వైరివీరులను నుగ్గు నూచంచేస్తున్న సైనికునికి—తను చిత్రవధచేయబడి, తనశవాన్ని కాకులు, గద్దలు పొడుచు తింటుంటుంటే, పురుగులు లుకలుక మంటుంటాయని అర్థమైపోయినప్పుడు; ఎంతఘోరం! తను ఇటు వంటి ఫలితాల వాశించి, ఈ విచిత్ర శక్తులను పొందలేదు.

*　*　*　*

ఇంతలో పెద్దగోల వినపడ్డది. వేలాది పద్యానములతో చెవులు మార్మోగిపోతున్నాయి. ఆయుధాల ఖణంఖణ ధ్వనులు, ఆర్తనాదాలు, ఏడుపులు, విజయధ్వానాలు...

"బహుశః అగ్నిమిత్రునిసైనికులు కోటలోకి ప్రవేశించి ఉంటారు" అనుకొన్నాడు గుణనిధి.

7

శంకరుడు ఆలోచిస్తూ కూర్చున్నాడు. పార్వతి నిశ్శబ్దంగా ప్రవేశించింది.

"విన్నాను. ఇప్పుడే నందీశ్వరుడు చెప్పాడు" అన్నది పార్వతి మెల్లగా.

శంకరుడు ఆలోచిస్తూనే అటూఇటూ తిరిగాడు. పార్వతి ధర్మముఖంవంకే చూస్తున్నది.

"ఈప్రయోగం ఫలిస్తుందనుకున్నాను. కొంతంత ఆశనో ఎదురుచూశాను. చివరికి విష ఫలితాన్నిచ్చింది." అన్నాడు శంకరుడు దిగులుగా.

"ఎందుకని?"

"అదే ఆలోచిస్తున్నాను. లోపమెక్కడున్నదో కనపడి చావటంలేదు."

పార్వతి మాట్లాడలేదు.

"నువ్వెక్కడన్నా పసిగట్టావా?" శివుడన్నాడు.

పార్వతి ఏ సమాధానమూ ఇవ్వలేదు. చిన్న నవ్వు నవ్వింది. శంకరుడుగూడా నవ్వాడు. కానీ అది నవ్వులాగలేదు. ఏమి చేయటానికీ తోచనప్పుడు చేసే చేష్టలాగా, పాలిపోయి ఉన్నది.

"నాది సమాధానంకాదు" అంటూ ప్రారంభించింది ఉమా దేవి. "మొదటినుండీ నేను గుణనిధిని పరిశీలిస్తూ వచ్చాను. అతను భవిష్యత్తును గురించి చెప్పటంలో గూడా అట్టి సమన్వయం లేదు. ఒకాయనకు, కొడుకువివాహం గురించి చెబుతూ 'మరణ కారణ మేమిటో చెప్పాను. ఆకారణం రాకుండా చూసుకోండి. సత్ఫలితం కలగవచ్చు', అంటాడు. ఇన్ని కారణాలను, సంఘట నలను చెప్పిన గుణనిధి; వాల్లా కారణాలు రాకుండా చూడ గలమో లేదో. ఫలితం ఎలా ఉంటుందో స్పష్టంగా ఎందుకని చెప్ప లేక పోయాడు? సమరసేనునితో మాట్లాడుతూ, 'రెండుమూడు రోజుల్లో అగ్నిమిత్రుడు సైనికుల్ని తీసుకొస్తున్నాడని, ఏమరు పాటుగా కోటమీద దాడిచేసి దాన్ని వశంచేసుకొంటాడని, మిమ్మల్ని బందీగా పట్టుకుంటాడని' భవిష్యత్తును గురించి చెల్ల డిస్తాడు. అలాగే అగ్నిమిత్రుడు వచ్చాడు. కోటను వశం చేసు కొన్నాడు. సమరసేనుణ్ణి ఖైదీగా పట్టుకొన్నాడు. బాగానేఉంది. అయితే - సమరసేనుని గతి వృత్తాంతం చెప్పిన తరువాత, తను ఏమౌతానన్న ఆలోచన గుణనిధికి రాలేదు. ఇంతమంది భావి జీవితాలనుగురించి, పోపపత్రికంగా చెప్పగలిగిన గుణనిధి, తనే ఎందుకు ఖైదీ అయినాడు? ఇలా అవుతానని ముందుగా అతని కెందుకు తెలియలేదు? తెలిసీ చేశాననటానికి వీల్లేదుగదా? ముందు వీటికి మీరు సమాధాన మివ్వండి." అన్నది పార్వతి.

సమాధాన మివ్వడానికి శంకరు డక్కడలేడు. అతను వెళ్ళి పోయిగూడా చాలా సేపయింది.

"పాపం! గుణనిధి ఘోరంగా చనిపోయాడు. ఇటువంటి మంత్రశక్తులున్నవాళ్ళు బ్రతికిఉంటే శేశానికి అనర్థకమని అగ్ని మిత్రుడు కొరడాలతో కొట్టించి చంపాడు. కుక్కలను ఉసి గొల్పాడు. పాపం! మాకోసం అతను చిత్రహింసలు పడ్డాడు" అనుకొన్నది ఉమ.

*　*　*　*

పార్వతీదేవి సందేహాలను, ఆతరువాత గూడా శంకరుడు తీర్చలేదు. అప్పటికీ ఇప్పటికీ అసందేహాలు సందేహాలుగానే ఉండి పోయాయి.